# పెళ్ళిచూపులు

సుబ్బారావు

"ఇంక అమ్మాయిని తీసుకు రండమ్మా!" అన్న మధ్యవర్తి మాధవరావుగారి మాటలు, శార్వాణి గుండెల్లో ఖంగు మన్నాయి. పెళ్ళిచూపులకని ముస్తాబయి వెనకగదిలో నించుందామె.

జీవితంలో మొట్టమొదటిసారిగా చూపులు జరుగుతున్నాయి తనకి. పెళ్ళి చూపులివి. నలుగురి ముందుకే వెళ్ళటానికి బిడియ పడే తనకి. ఈ పెళ్ళిచూపులు ఒక అగ్ని పరీక్ష అయి నిలిచాయి అప్పటికి గుండె దిటవు చేసుకుంది. అది కాస్తా మాధవరావుగారి మాటలతో దిగజారిపోతోంది."

ఇది లోపల శార్వాణి పడుతున్న యిరకాటం!

ముందర గదిలో మాధవరావుగారి మాటలతో కాస్త చలనం బయలేరిందనే చెప్పాలి అందరిలో! సరస్వతమ్మగారు లేచారు కూతుర్ని తీసుకురావటానికి.

అప్పటి దాకా పెళ్ళికొడుకు హోదాలో కుర్చీలో యిబ్బంది పడుతున్న ఉదయమూర్తి "దయచేసి ఆగండి!" అన్నాడు సరస్వతమ్మగారు లేవటం చూసి.

ఒక్కసారి అక్కడున్న అందరి చూపులు అతనిమీద నిలిచాయి

లోపల, లోలోన మథనపడుతున్న శార్వాణి గుండె గతుక్కుమందొక్కసారి.

మాధవరావుగారి వైపు తిరిగిన ఉదయమూర్తి లేచి నించున్నాడు "మాధవరావుగారు! ఇక్కడెంత మందున్నారు?...." అని ఆగి మళ్ళీ తనే మాట్లాడాడు "—ఆగండి! నేనే చెప్తాను మీరు, నేను, అమ్మా. నాన్నా: అన్నయ్య వదిన ఇది మనవైపు. ఇక పోతే వారు అంటే ఆ అమ్మాయి తల్లిదండ్రులు, మేనమామ, పిన్ని, బాబాయిగార్లు వీళ్ళుగాక పిల్లలు వుండనే వున్నారు. ఇంతమంది మధ్యకి ఆ అమ్మాయి వస్తుంది. ఎలా? సిగ్గుతో తల దించుకుని, కనురెప్పలు వాల్చుకుని వణికే పెదవులతో, అదురుతున్న గుండెల్ని చిక్కబట్టుకుంటూ, తడబడే అడుగులతో వస్తుంది! అవునా?" మళ్ళీ ఆగి అందరి వంక చూశాడు ఉదయమూర్తి

అందరూ అవాక్కులయి నోళ్ళు తెరిచి ఆశ్చర్యంగా చూస్తున్నారతని వంకే!

కాస్తంత ఆవేశం ధ్వనిస్తున్న ఆ మాటలకి విస్తుపోయింది, లోపలున్న శార్వాణి. ఆ మాటలు ఒకపక్క ఆనందాన్ని కలుగజేస్తున్నా మరో పక్క భయపెడుతున్నాయి.

"ఏం? ఎవ్వరూ మాట్లాడరే? నాకు తెలుసు. మీరెవ్వరు మాట్లాడలేరు. మామూలు మధ్య తరగతిలోని ఆడపిల్లలందరికి ఎదురయ్యే సన్నివేశమే యిది. కాని, నాకిది గిట్టదు. ఆ అమ్మాయి

ఏం తప్పు చేసిందని మనందరి ముందర అలా తలొంచుకుని కూర్చోవాలి. ఎందుకా శిక్ష?—ఎలాగూ యిక్కడున్న మీరందరూ ఆమెని చూశారు ఇక నేనొక్కడిన్నీ మిగిలాను. కాబట్టి నేనొక్కడ్నే ఆఅమ్మాయిని చూస్తాను. నన్నొక్కడ్నే ఆ అమ్మాయి చూస్తుంది సో, నన్నందరూ మన్నించి బయటికి వెళ్ళండి. మాకు ఏకాంతం కల్పించండి!" ఉదయమూర్తి యిక తను మాట్లాడాల్సింది అయిపోయిందన్నట్లుగా తిరిగి కుర్చీలో కూర్చున్నాడు.

అందరూ చిత్రవులే అయ్యారు, ఆ మాటలకి కొన్ని నిముషాలే పట్టింది వారు తేరుకోవటానికి.

శార్వాణి మనసులోనే అతడ్ని అభినందించింది. కాని మరో వెపు నుంచి ఏదో జంకు బయలేరిందిఆమెలో తను.... ఒంటరిగా.... అతనితో...అపైన ఆలోచనకి పొంతన కుదరలేదు.

"ఆఁ హాఁ! మొత్తానికి భలేవాడివోయి మూర్తి చూడండి వెంకటేశ్వర్లు గారు! ఇది యువతరం కానివ్వండి. పైగా అతనన్నది సబబుగానే వుంది మరి, ఏమంటారు?"అప్పటికి తేరుకున్న మాధవరావుగారు నవ్వేస్తూ శార్వాణి తండ్రితో అన్నారు. ఆ మాటల్తో అక్కడి వాతావరణం కొంత తేలిక పడ్డది.

ఉదయమూర్తి సంస్కారాన్ని లోలోపలే మెచ్చుకున్నారు వెంకటేశ్వర్లు గారు. ఏదో అనుమానం మెదిలినా మరుక్షణమది మరుగయ్యింది సరస్వతమ్మ గారిలో!

"తండ్రికి తగ్గ తనయుడు!" భర్తనుద్దేశించి మెల్లిగా అంది సావిత్రమ్మ.

చిన్నగానవ్వుతూ భార్యవంకచూసిన రాఘవరావుగారి చెయ్యి అప్రయత్నంగానే మీసాన్ని దువ్వింది!

"చూడు మూర్తి! మేమందరము బయటకి వెళ్ళేకంటే నువ్వొక్కడివే లోపలికి వెళితే బాగుంటుంది. అదుగో, అమ్మాయి ఆ గదిలో వుంది." కాస్త బిగ్గరగానే నవ్వుతూ వేల్తో ఆ గదిని చూపెట్టారు మాధవరావుగారు.

ఆ మాటలు విన్న శార్వాణి పెట భుజాల మీదకి లాక్కుంటూ వొదిగి నిలబడింది

అన్నదే తడవుగా లేచి ముందు కడుగేశాడుఉదయమూర్తి:"థాంక్సండీ!కాని, యిందుకు మీలో నేనెవ్వరి మనసైనా నొప్పించి వుంటే క్షమించండి." అని ఆ గది లోపలికి వెళ్ళిపోయాడు.

తలదించుకుని దాదాపు గోడనతుక్కుపోయి నిలబడ్డ ఆమెని చూస్తూనే, కించిత్ బాధపడ్డాడతను. "చూడండి! మిస్. శార్వాణీ, మిమ్మల్నిలా అనవసరంగా సిగ్గుతో బాధపెటటం యిష్టం లేకనే ధైర్యంచేసి అలా మాట్లాడాను. తిరిగి మీరు అలానే ప్రవర్తిస్తే నన్ను బాధపెటిన వాళ్ళవుతారు .... ప్లీజ్! మరోలా అనుకోకండి. ఇప్పుడు మనం స్నేహితులం మాత్రమే. టేక్ యువర్ సీట్" అంటూ అక్కడున్న ఒక కుర్చీలో కూర్చున్నాడు ఉదయమూర్తి.

ఎంతో ప్రయత్నం మీద కనురెప్పలెత్తి అతనివంక చూసిన ఆమె, అతడు తనవైపే చూస్తుండటం చూసి చటు

క్కున కళ్ళు వాల్చేసింది. మెల్లిగా నడిచివచ్చి అతని కెదురుగావున్న మరో కుర్చీలో ఒక పక్కకు వొరిగి తలదించుకునే కూర్చుంది।

"థాంక్యూ!—నాకేవో ఆదర్శాలున్నాయంటూ సొంత డబ్బా వాయించుకోవటం యిష్టంలేదు నాకు కాని ప్రేమ-పెళ్ళి-భార్య అనే పదాలకు నేనెంతో విలువనిస్తాను. అంతేకాదు మనిషికి మనసు—మమత ఎంతో ముఖ్యం. ఇవి లేనినాడు జీవన మనుగడ కష్టమయిపోతుంది...." అంటూ ఆగి ఆమెవంక చూశాడతను.

శార్వాణి ఆశ్చర్యంగా అతని వంకే చూస్తోంది. యింత విశాల హృదయమూ ఇతనిదని।

"....సారి। ఏదేదో మాట్లాడేస్తూ బోర్ కొట్టేస్తున్నాను కదండి. క్లుప్తంగా నా అభిప్రాయం చెప్తాను. ఇంత డైరక్టుగా చెప్తున్నానేమిటా అని, అపార్థం చేసుకోకండి...... " అంటూ మళ్ళీ ఆగి "చెప్పనా" అన్నట్టుగా ఆమె వంక చూసాడు.

"నాకు అంతగా మాట్లాడటం రాదు. కాని మీ లాంటి సహృదయుల్ని నేనే కాదు, ఎవ్వరూ అపార్థం చేసుకోలేరని నా అభిప్రాయం"తడబడుతూనే మనసులోని మాటను బయట పెట్టేసింది శార్వాణి.

"వెల్। మీరు నాకు పూర్తిగా నచ్చారు. నేను మిమ్మల్ని మనస్ఫూర్తిగా నా జీవితంలోకి భార్యగా ఆహ్వానిస్తున్నాను. కాని జరగబొయ్యేది వివాహం. అందుకు వధూవరులిద్దరి అంగీకారం ఎంతో ముఖ్యం. కొబట్టి మీరు కూడ మీ అభిప్రాయం......." అంటూ అర్థోక్తిలో ఆగి ఆమెవంక చూసాడతను.

శార్వాణి సిగ్గుతో మరింత ముడుచుకుపోయింది చెప్పాలనుంది. కాని ఏదో తెర అడ్డు వస్తోంది. పెదవి కదపలేక పోతోంది.

ఉదయమూర్తి తనలో తనే చిన్నగా నవ్వుకున్నాడు "అఫ్‌కోర్స్। తొందర లేదు. ఆలోచించుకుని మరీ చెప్పండి," అని జేబులోంచి పోసుకార్డు తీసిన అతను, "చొరవ తీసుకుంటున్నందుకు క్షమించండి నన్ను. ఇది నా అడ్రస్ వున్న పోసుకారు మీ నిర్ణయాన్ని యీ కారు ద్వారా తెలియపర్చండి. మరి వస్తాను. సెలవ్" కార్డు ఆమె చేతుల్లో జారవిడిచి కుర్చీలోంచి లేచి బయటకి వచ్చేశాడతను

అతను వెళ్ళిన వైపే చూస్తూ, చేతిలో వున్న కార్డును చటుక్కున పెదవుల కానించుకుందామెందుకో।

* * *

"ఎంత బుద్ధిమంతుడు. ఎంత వినయం. నిజంగా ఈ సంబంధం కుదిరితే మన శారు అదృష్టం పండినట్టే " పెళ్ళివారు వెళ్ళిన వైపే చూస్తూ నిండు మనసుతో అంది సరస్వతమ్మ.

"ఊ! ఊ!! ఈ మురిపమంతా యిప్పుడేనా?-పెళ్ళినాటికి కాస్త దాచుకో మరి।" అప్పుడే సంబంధం కుదిరిపోయినట్లుగా సంబరంగా అన్నారు వెంకటేశ్వర్లుగారు.

తల్లిదండ్రుల మాటలు విన్న శార్వాణి మనసు ఆనందంతో పుక్కిరి

బిక్కిరయింది. పురివిప్పి నాట్యమాడుతున్న నెమలే అయ్యిందామె।

'ఇంతలోనె కార్డు విషయం జ్ఞాపకమొచ్చింది. ఇటువంటి విషయాల్లో ఆలశ్యం పనికిరాదు. ఆలశ్యం అమృతం విషం। వెంటనే తన అంగీకారం తెలియజెయ్యాలి' అనుకొంటూ కార్డు మీద రాయబోయినదల్లా ఆగిపోయింది ంతలోనే।

* * *

"పెళ్ళికొడుకుగా తన హోదాను తను దుర్వినియోగం చేసుకోలేదు కదా. లేకపోతే పరాయి ఆడపిల్లతో సిగ్గులేకుండా ఒంటరిగా మాట్లాడటమేమిటి? ఉత్తరం రాయమనడమేమిటి? ఛీఛీ।। బుద్ధి లేదు నిజంగా.

కనీసం ఆ పనేసే ముందు అందుకా అమ్మాయి యిష్టపడుతుందో, లేదో కూడ కనుక్కోలేదు తను. ఏమనుకుందో ఏమో? తన్నొక నీచుడిగా, దుర్మార్గుడిగా, వ్యామోహపరుడుగా అనుమానించ లేదు కదా—?।"

ఇంటి కొచ్చిం తరువాత మనసున ముసురుతున్న ఆలోచనల్తో సతమతమయిపోతున్నాడు ఉదయమూర్తి

ఒకపక్క తనకా అమ్మాయి పూర్తిగా నచ్చిందంటూనే మరోపక్క వాళ్ళకి వుత్తరం రాయనంటాడేమో అని రాఘవరావు, సావిత్రమ్మగార్లు ఆశ్చర్య పోతున్నారు కొడుకు స్వభావం అర్ధంకాక.

కాని పోస్టుకార్డు సంగతి వాళ్ళకేం తెలుసు ఒక ఉదయమూర్తికి తప్పితే।

అందరి సందేహాల్ని, అనుమానాల్ని పారద్రోలుతూ వారం రోజుల్లోపలే రానే వచ్చింది శార్వాణి రాసిన వుత్తరం.

తన్మయత్వంతో మళ్ళీ మళ్ళీ చదువుకున్నాడు ఉదయమూర్తి అమితానందంతో ఆ అమ్మాయితో యుగళ గీతాలు పాడేశాడు.

"వెంటనే లగ్నాలు పెట్టుకోమని" వాళ్ళకి వుత్తరం రాసేయమనికూడ తల్లి తండ్రులకు చెప్పాడు, కార్డు విషయం రహస్యంగానే వుంచేస్తూ. ఈ సారి కొడు కర్థం కాలేదా తల్లితండ్రులకు।

చాటుగా మరోసారి చదువుకున్నాడు 'ఆ' వుత్తరాన్ని ఉదయమూర్తి.

"ఉదయమూర్తి గారికి,

నమస్కారాలు ఎలా రాయాలో తెలియక యిన్నిరోజులూ ఆగిపోయాను, రాయకుండా చివరికి ధైర్యంచేసిరాస్తున్నా నీ ఉత్తరాన్ని. నేను... మీకు........ జీవితాంత.....ప్స్ః నాకేమిటో సిగ్గుగా వుంది. కానీ...కాని మీరర్థం చేసుకున్నారని అనుకుంటున్నాను ఆడపిల్లని యింతకంటే రాయలేను. ఉంటాను.

ఇట్లు.

మీ శార్వాణి"

'మీ శార్వాణి' ఓహ్...। ఎంత మధురమైన పదం. ఎంత తీయనిదీ భావన.

"మనసు నిండా నిన్నే నింపుకుని, కొలుచుకుంటున్నానని ఎలా చెప్పను శార్వాణీ, యింత దూరంనించి!" అనుకున్నాడు ఉదయమూర్తి పరవశంగా.

ఇంక ఉదయమూర్తిని డిస్టర్బ్ చేయకూడదు మరి।

## ఈ కథ గురించి

ఈ కథ చదివి సమాజంలో మార్పు



తేవాలని. క్రొత్త తరహా కథలు రాయాలని ఉత్సాహం మంచిదేకాని, క్రొత్త రచయితలు తమ రచనలని అనుభవంవున్న రచయితలకి చూపి సరిచేయించుకోవడం మంచిది. ఇదే మా శార్వాణి అయితే పెళ్ళికొడుకు వచ్చేటప్పుడే, "ఇంతమంది ఎవరున్నారని తెలియలేదా? తీరా వచ్చాక అమర్యాదగా పెద్దల్ని బయటికి వెళ్ళమనడమేమిటి" అని విసుక్కునేది. పైగా పెళ్ళికొడుకే ఆడపిల్ల ఇంటికి ఎందుకురావాలి. ఆడపిల్లే పెళ్ళికొడుకుని చూడటానికివెళ్ళి, అతనికో షేక్‌హ్యాండ్ ఇచ్చి పరస్పరం అర్థంచేసుకోవడానికి వీలుగా వుంటుంది. అలాఎక్కడికన్నా వెళ్దాం రా అని పిలుచుకు పోయేది–అని మా మేనేజ్‌మెంటు వారు రచయితకి లేఖ వ్రాయగా ఈ క్రింది విధంగా లేఖ వచ్చింది

"మీ వుత్తరం అందింది. మీ సద్విమర్శ చదివి కథలో నేను చేసినపొరపాటేమిటో తెలుసుకున్నాను. కథలో మూర్తి వ్యక్తిత్వమే దెబ్బ తిన్నది. మీరా పొరబాటును సరిదిద్ది ప్రచురించవలసిందిగా కోరుతున్నాను. మొదట్లో చిన్న రచయితలతో పరిచయం పెంచుకోవాలని తహతహలాడాను. ఉత్తరాల ద్వారా కూడా ప్రయత్నించాను. ఎవరూ సహకరించలేదు. మీకు ప్రతి నెలా కథలు పంపి అవి అచ్చయినా, కాక పోయినా మీ అమూల్యమైన సలహాలను వినాలని కుతూహలపడుతున్నాను

— సుబ్బారావ్'

*గమనిక :*

పాఠకులు ఈ విషయంపై వాదోపవాదాలు చేయక, అభిప్రాయాలు మాత్రం తెలియజేయ గలందులకుగాను కోరుతున్నాము.

—అనామిక

అనామిక